RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

**94916 28386     85220 22029**

**Land Line No : 08517 224194**

కర్నూలు సంపుటి : 04 సంచిక : 80    మంగళవారం 23-07-2024    పేజీలు :04    వెల:రూ.2.00

## ఏపీలోని రైతులకు ప్రభుత్వం గుడ్ న్యూస్

### మంత్రి కింజరాపు అచ్చేన్నాయుడు

అమరావతి,ఖరీఫ్ సీజన్ కోసం సహకార సంఘాల్లో ఎరువులను సిద్ధం చేసింది. ఖరీఫ్ సీజన్ కోసం రైతులకు విక్రయించేందుకు 1321 సహకార సంఘాల్లో ఎరువులను సిద్ధం చేశారు. ఖరీఫ్ సీజన్ సన్నద్ధత మీద అధికారులతో ఏపీ వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సమీక్షించారు. ఖరీఫ్ సీజన్ కోసం పూర్తి స్థాయిలో సిద్ధం కావాలని ఆదేశించారు. ఈ సీజన్ కోసం 17.50లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులను సిద్ధం చేయాలని అచ్చెన్నాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 14 లక్షల టన్నుల ఎరువులు ఉన్నట్లు తెలిపారు. మిగిలిన వాటిని కూడా సకాలంలో రాష్ట్రానికి చేరుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ వ్యవసాయశాఖ మంత్రి ఆదేశించారు.అలాగే కల్తీ ఎరువుల కట్టడి కూడా అచ్చెన్నాయుడు చర్యలు ప్రారంభించారు. వీటితో పాటు లైసెన్స్ లేని సహకార సంఘాలకు కూడా పర్మిషన్లు ఇచ్చి ఎరువుల విక్రయాలు జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. ఏపీలో భారీ వర్షాల నేపథ్యంలో సాగుపై అల్పపీడన ప్రభావం, పంట నష్టం గురించి కూడా అధికారులతో వ్యవసాయశాఖ మంత్రి చర్చించారు. పంట పొలాల్లో నిలిచిన నీటి తొలగింపుతో పాటుగా, తేమ ద్వారా ఆశించే తెగుళ్ల నివారణపైనా రైతులకు సూచనలు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

# సభలో విపక్షాలు సమయాన్ని వృధా చేస్తున్నాయ్

### సమస్యలను ప్రస్తావించకుండా అడ్డుకునే యత్నాలు
### బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగాలని ఆకాంక్ష : మోదీ



న్యూఢిల్లీ,జూలై22 : కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన తరువాత ఎన్డీయే సర్కార్ తొలి బడ్జెట్‌ను మంగళవారం ప్రవేశపెట్టబోతోంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మీడియాతో మాట్లాడారు. పార్లమెంటు విలువైన సమయాన్ని ప్రతిపక్షాలు వృథా చేస్తున్నాయని ఆయన విమర్శించారు.'నేను బరువెక్కిన హృదయంతో చెబుతున్నా... కొందరు ఎంపీలు, ఇతరులను తమ నియోజకవర్గ సమస్యలపై సభలో మాట్లాడే సమయం ఇవ్వకుండా చేస్తున్నారు. రాజకీయ విభేదాలను పక్కనబెట్టి నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలి. సభలో నిరసనలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని రాజ్యాంగ విరుద్ధంగా నిశ్శబ్దం చేసేందుకు ప్రయత్నించారని మోదీ అన్నారు. ఇదివరకు జరిగిన సభల్లో రెండున్నర గంటలు నాపై ప్రతిపక్షాలు నోటికొచ్చినట్లు మాట్లాడాయి. ప్రజాస్వామ్య సంప్రదాయాల్లో ఇలాంటి వ్యాఖ్యలకు తావుండదు. వీటన్నింటినీ దేశం నిశితంగా పరిశీలిస్తోంది. విపక్షాలు నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలి. కనీసం ఈ సమావేశాలైనా సజావుగా సాగుతాయని ఆశిస్తున్నా. 2014 తర్వాత కొంతమంది ఎంపీలు ఒకసారి, మరికొందరు రెండోసారి గెలిచారని అన్నారు. కానీ.. విపక్షాల అరుపుల మధ్య వారిలో చాలా మంది వారి సమస్యలను సభాసాక్షిగా వినిపించలేక పోయారు. ఇక నుంచైనా సమావేశాలను సజావుగా సాగనిస్తూ.. ప్రజల ఆకాంక్షలను సభలో వినిపించనివ్వండి. 60 సంవత్సరాల తరువాత వరుసగా మూడు సార్లు ఓ పార్టీ అధికారంలోకి రావడం ఇదే తొలిసారి. మూడోసారి అధికారం చేపట్టాక తొలి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం అని మోదీ వ్యాఖ్యానించారు. సుపరిపాలనకు ఈ బడ్జెట్ ముఖ్యమైనది. రాబోయే 5 ఏళ్లకు ఇది దిశానిర్దేశం చేస్తుంది. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి బలమైన పునాది అవుతుంది. గత మూడేళ్లలో దేశం 8 శాతం ఆర్థిక వృద్ధిని సాధించింది. దేశంలో పెట్టుబడిదారులకు సానుకూల వాతావరణం ఉంది. అందుకు తగినట్లు వేల సంఖ్యలో కంపెనీలు భారత్‌కి వచ్చి పెట్టుబడులు పెడుతున్నాయ్. లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నాయ్' అని మోదీ పేర్కొన్నారు.

# చంద్రబాబు విజనరీ నాయకుడు

### - ఏపీ అభివృద్ధికి తీవ్రంగా కృషిచేశారు: గవర్నర్



అమరావతి,విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. శాసనసభ సమావేశాలు ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ఆయన ప్రసగించారు. రాష్ట్ర విభజనతో నవ్యాంధ్రకు నష్టం వాటిల్లిందని, అలాంటి స్థితిలో అన్ని రంగాల అభివృద్ధికి చంద్రబాబు తీవ్రంగా కృషి చేశారని గుర్తుచేశారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రానికి పెట్టుబడుల వరద కొనసాగిందన్నారు. రాజధాని నిర్మాణానికి అపూర్వ కృషి సాగిందని, 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలు దెబ్బతిన్నాయని గవర్నర్ పేర్కొన్నారు. విభజన వల్ల ఆంధ్రప్రదేశ్కు నష్టం ఏర్పడిందని, ఆంధ్రప్రదేశ్ సమ్మిళిత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ పేర్కొన్నారు. శాసనసభ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. కొత్తగా ఎన్నికైన సభ్యులకు ధన్యవాదాలు, కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు విజనరీ నాయకుడు అని, 2014లో ఏపీ అభివృద్ధికి ఆయన తీవ్రంగా కృషిచేశారని గవర్నర్ గుర్తు చేసుకున్నారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్రంలో పెట్టుబడుల వరద కొనసాగిందన్నారు. అనేక సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొచ్చాయని, రాజధాని నిర్మాణానికి చంద్రబాబు ఎంతో కృషిచేశారని కొనియాడారు. 2019లో వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అన్ని రంగాలు నష్టాలు చవిచూశాయన్నారు. చంద్రబాబు హయాంలో వచ్చిన పెట్టుబడిదారులు వెనక్కి మళ్లారని తెలిపారు. 2019 నుంచి 2024 మధ్య కాలంలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్లిందని పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియలో ప్రజలు చురుగ్గా పాల్గొన్నారని, మార్పు కావాలని ప్రజలు ఆకాంక్షించారన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే బాధ్యత సభ్యులపై ఉందని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశును అశాస్త్రీయంగా విడదీశారన్న గవర్నర్, భాగస్వాములతో చర్చలు చేయకుండా విభజించారన్నారు. ఉమ్మడి ఏపీ విభజన రాష్ట్ర ప్రజల హృదయాల్లో మాయని మచ్చగా మిగిలిందని తెలిపారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ వల్ల అల్లకల్లోలం ఏర్పడిందన్న గవర్నర్, రాష్ట్ర ప్రజలు సుదీర్ఘకాలం అభివృద్ధి పురోగతికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.విభజన చట్టం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తగినంత పరిహారం ఇవ్వలేదన్న గవర్నర్, ఆస్తులు, అప్పుల పంపిణీలో అసమానతలు ఉన్నాయన్నారు. అశాస్త్రీయ విభజన వల్ల 46 శాతం వనరులు మాత్రమే వారసత్వంగా వచ్చాయని, రాజధాని హైదరాబాద్ను కోల్పోవడం వల్ల ఆర్థిక నష్టం జరిగిందని చెప్పారు. ఉన్నత విద్యాసంస్థలు కోల్పోయామన్న గవర్నర్, భారీ రెవెన్యూ లోటు వారసత్వంగా వచ్చిందని తెలిపారు. ప్రాంతం ఆధారంగా ఆస్తులు, వినియోగం ఆధారంగా విద్యుత్ పంపిణీ చేశారని, ఎలాంటి ఆధారాలు లేకుండా విద్యాసంస్థలు విభజించారన్నారు.ఉమ్మడి ఏపీలో తలసరి ఆదాయం లక్షా 6 వేల 176 కోట్లు ఉండేదని, విభజిత ఏపీలో తలసరి ఆదాయం 93 వేల 121 కోట్లకు పడిపోయిందని ఆవేదన వెలిబుచ్చారు. రాష్ట్ర విభజన వల్ల ప్రతికూల ప్రభావం పడిందన్న గవర్నర్, అపరిష్కృత సమస్యల వల్ల సవాళ్లు వచ్చాయన్నారు. విభజన వల్ల ఏర్పడిన సంక్షోభాన్ని చంద్రబాబు ప్రభుత్వం అవకాశంగా మలచుకుందని, సన్రైజ్ ఆంధ్రప్రదేశ్కు చంద్రబాబు ప్రభుత్వం పునాది వేసిందని కొనియాడారు. సముద్ర తీరం, నౌకాశ్రయ ఆధారిత అభివృద్ధిపై, తయారీ కార్యకలాపాలకు అవసరమైన వాతావరణంపై చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించిందని స్పష్టం చేశారు.2014-19 మధ్య కాలంలో అభివృద్ధి, సంక్షేమం మధ్య స్పష్టమైన సమతుల్యం ఉందన్న, గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంతో పట్టిసీమ రికార్డు సమయంలో పూర్తయిందని తెలిపారు. ఏడాది సమయంలోనే చంద్రబాబు ప్రభుత్వం పట్టిసీమ పూర్తిచేసిందని, చంద్రబాబు హయాంలో పోలవరం ప్రాజెక్టు 72 శాతం పూర్తయిందని గుర్తు చేశారు. ఇతర నీటిపారుదల ప్రాజెక్టులకు చంద్రబాబు ప్రాధాన్యత ఇచ్చారన్న గవర్నర్, కరవు నివారణ చర్యలు, రియల్టైమ్ గవర్నెన్స్ చేపట్టారని పేర్కొన్నారు. భూసేకరణ ద్వారా అమరావతి ప్రాంత అభివృద్ధి చేశారని, కొత్త సచివాలయం, శాసనసభ భవన నిర్మాణం చేశారని తెలిపారు. చంద్రబాబు దూరదృష్టి నాయకత్వం వల్లే 2014-19 మధ్య అభివృద్ధి సాధ్యమైందన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో పొంగుతున్న వాగులు



విజయవాడ/హైదరాబాద్,జూలై22 : ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధాన నదులు కృష్ణా, గోదావరులు పొంగుతున్నాయి. ప్రధానంగా గోదావరికి వరద పోటెత్తుతోంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గత మూడు రోజులుగా ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరుల నుంచి వరద వచ్చి చేరుతోంది. తెలంగాణలోని గోదావరి పరీవాహకం లోనూ భారీ వర్షాలు పడుతుండటంతో కిన్నెరసాని, ముర్రేడు, కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ-అన్నారం బ్యారేజీల మధ్య వాగుల నుంచి పెద్దఎత్తున వరద వచ్చి గోదావరి నదిలో కలుస్తోంది. దీంతో ప్రవాహం పెరుగుతోంది. మేడిగడ్డ వద్ద 5.52 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 16,850 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండడంతో 66 గేట్లు ఎత్తి అదేస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. ఇంద్రావతి కలిసిన అనంతరం సమ్మక్క బ్యారేజీ వద్ద 8.23 లక్షల క్యూసెక్కులు, దుమ్ముగూడెం సీతమ్మసాగర్ ఆనకట్ట వద్ద 9.01 లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి(43 అడుగులు)ని నది దాటింది.

### గోదావరికి ఉధృంతగా వరదనీరు
### పరీవాహకాల్లోని ప్రాజెక్టుల్లో జలకళ
### శ్రీశైలానికి ఉరకలెత్తుతున్న కృష్ణా ప్రవాహం
### గోదావరి వరదపై మంత్రి పొంగులేటి సమీక్ష



నదీ పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గక పోవడంతో మరికొంత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి 18,518 క్యూసెక్కుల వరద చేరుతోంది. నిర్మల్ జిల్లాలోని కడెం నారాయణరెడ్డి జలాశయంలో ఆదివారం ఉదయం నాలుగు వరద గేట్లు ఎత్తారు. మధ్యాహ్నానికి వరద తగ్గడంతో ఒక గేటు మూసేసి మూడు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. కృష్ణా నదిలో ఎగువన వరద పెరుగుతోంది. కర్ణాటకలో ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాల కింద అప్రమత్తత ప్రకటించారు. ఆదివారం సాయంత్రానికి ఎగువ నుంచి భారీ ప్రవాహాలు వస్తుండటంతో ఆలమట్టి నుంచి దిగువకు 1.50 లక్షల క్యూసెక్కుల నీటి విడుదలను ప్రారంభించారు. ఇది మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు కర్ణాటక జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. నారాయణపూర్ నుంచి 25 గేట్లు తెరిచి 1.45 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో జూరాలకు వరద పెరిగింది. ప్రాజెక్టు 22 గేట్లను తెరిచారు. శ్రీశైలం జలాశయం వద్ద 96 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నది పరీవాహకంలోని లోతట్టు ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని పరీవాహక జిల్లాల కలెక్టర్లను రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. వరద పరిస్థితులపై ఆదివారం హైదరాబాద్‌లో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నదులు, వాగుల ప్రవాహాలతో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్దేశిరచారు. కలెక్టరేట్లలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి.. సమన్వయం చేయాలని కోరారు. రెస్క్యూ బృందాలు, ఎన్డీఆర్ఎఫ్ బృందాల సాయాన్ని తీసుకోవాలని సూచించారు.

## ప్లకార్డులతో అసెంబ్లీలోకి ప్రవేశించే యత్నం

### జగన్‌ను అడ్డుకున్న పోలీసులు
### పోలీసులపై వేలెత్తి చూపుతూ జగన్ ఆగ్రహం



అమరావతి,జూలై22 : ఏపీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వైకాపా ఎమ్మెల్యేలు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. సమావేశాలకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు నలుపు కండువాలతో వస్తుండగా.. లోపలికి అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై వైకాపా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జగన్ అభ్యంతరం తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించవద్దని చెప్పడంపై మండిపడ్డారు. పేపర్లు గుంజుకుని చింపేసే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని.. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని వ్యాఖ్యానించారు. పోలీసులపై వేలు చూపుతూ హెచ్చరించారు.పోలీసు అధికారి మధుసూదనరావును ఉద్దేశిస్తూ మధుసూదనరావు.. గుర్తు పెట్టుకో.. ఎల్లకాలం ఇలాగే ఉండదని హెచ్చరించారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. నీ టోపీపై ఉన్న సింహాలకు అర్థమేంటో తెలుసా? అధికారంలో ఉన్నవారికి సెల్యూట్ కొట్టడం కాదు.. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మీరున్నారు' అని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పోలీసులు, వైకాపా ఎమ్మెల్యేల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మారే సూచనలు అసలు కనిపించడమే లేదు. చివరకు పోలీసులతో కూడా గొడవ పడుతున్నారు. అసెంబ్లీ లోపలికి వైఎస్ జగన్ కారును అనుమతించేందుకు ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ఎమ్మెల్యేలు అసెంబ్లీ 4 వ నంబరు గేటు బయట దిగి లోపలికి వెళ్లేలా నిబంధనలు ఉన్నాయి. ప్రతిపక్ష హోదా లేకున్నా అసెంబ్లీ లోపలికి జగన్ వాహనం తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. వైసీపీ శాసన సభపక్ష విన్నపం మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ ప్రభుత్వం ఇంతటి బంపరాఫర్ ఇచ్చినా కూడా పోలీసులతో తనను మెయిన్ గేటు నుంచి అసెంబ్లీలోకి వెళ్లనివ్వాలని జగన్ వాగ్వాదానికి దిగారు.

## మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాదం
## ఘటనపై సీఎం చంద్రబాబు సమీక్ష..



అన్నమయ్య జిల్లా: అసైన్డ్ భూముల ఫైల్స్ దగ్ధం అయినట్లు ప్రాథమిక సమాచారం.. అసైన్డ్ 22-ం, కోర్టు కేసుల ఫైల్స్, భూముల రీసర్వే ఫైల్స్ దగ్ధం అయినట్లు సీఎం చంద్రబాబుకు వివరించిన అధికారులు.. ఘటనపై అధికారులు స్పందించకపోవడంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం.. నిన్న రాత్రి 10.30 వరకు ఆఫీస్‌లోనే ఉద్యోగి గౌతమ్ తేజ ఉన్నట్లు గుర్తింపు.. ఆదివారం ప్రభుత్వ ఉద్యోగి ఆఫీసులో ఉండడంపై చంద్రబాబు ఆరా.. గౌతమ్ తేజను అదుపులోకి తీసుకున్న పోలీసులు, సెల్‌ఫోన్ స్వాధీనం.

## లోకేశ్‌తో మంత్రి సత్యకుమార్ భేటీ

### ఎన్డీఏ కూటమిలో చేరికలపై కలిసే నిర్ణయం
### ఇరు నేతల మధ్య ఆసక్తికర చర్చ

అమరావతి,జూలై22 : ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ లోని విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఛాంబర్‌లో బీజేపీ ఎమ్మెల్యేలు, ఆయనకు మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. అసెంబ్లీ సమావేశాల అనంతరం మొదటగా ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌తో సహా బీజేపీ ఎమ్మెల్యేలు లోకేశ్ ఛాంబర్‌కి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారు పలు అంశాలపై చర్చించారు. చాలా మంది వైసీపీ నేతలు తమ పార్టీ వైపు చూస్తున్నారని లోకేశ్‌కు బీజేపీ నేతలు చెప్పారు. అయినా తాము ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవట్లేదని వెల్లడించారు. ఎన్డీయే కూటమిలో చేరికలపై కూటమి పక్షాల నేతలు కలిసి కూర్చొని మాట్లాడుకుంటే మంచిదని బీజేపీ ఎమ్మెల్యేలు లోకేశ్‌కు చెప్పారు. ఈ ప్రతిపాదనపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇదే సరైన పద్ధతి అని దాన్ని వల్ల కూటమిలోని పార్టీల మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు రాకుండా ఉంటాయని లోకేశ్ వారికి చెప్పారు. ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా నుంచి వైసీపీ నేత తోట త్రిమూర్తులు బీజేపీలో చేరుతున్నారా లేదా అనే అంశం చర్చకు వచ్చింది. పార్టీలో ఆయన చేరికపై వస్తున్న ఊహాగానాలపై మంత్రి సత్యకుమార్‌ను అనపర్తి బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రశ్నలు లేవనెత్తారు.

# సంపాదకీయం

మంగళవారం 23-07-2024

## బడ్జెట్ సామాన్యులకు చిక్కేనా ?

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యాయి. ఓట్ ఆన్ అకౌంట్ తరవాత ఎన్నికలు..ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత పూర్తిస్థాయి బడ్జెట సమావేశాలు మొదలయ్యాయి. ప్రజలు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్న అనేక అంశాలకు, సమస్యలకు పార్లమెంట్ జవాబుదారీ కావాలి. ప్రజలకు తాము అండగా ఉన్నామన్న సంకేతం వెళ్లాలి. అప్పుడే ప్రజలకు విశ్వాసం కలుగుతుంది. ఇకపోతే దేశానికి దశాదిశానిర్దేశం చేసేలా బడ్జెట్ పద్దులు ఉండాలి. బడ్జెట్ అనగానే దేశ అభివృద్ధి ముఖచిత్రం కనిపించాలి. అంకెలా గారడీ కాకుండా దేశాన్ని నిలబెట్టేలా, ఆపపన్నులను ఆదుకునేలా, భవిష్యత్ దర్శనం చూపేలా ఉండాలి. కానీ ఏటా మొక్కుబడి బడ్జెట్ ప్రసగాలు సాగుతున్నాయి. గత పదేళ్లలో ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్న వారికి ఏ రకంగానూ బడ్జెట్‌లో ఏరడింపు కలగలేదు. ఈ క్రమంలో మంగళవారం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌పై దేశ ప్రజల్లో సహజంగానే ఆసక్తి కలుగుతోంది. గత పదేళ్లకు భిన్నంగా బడ్జెట్ ఉంటుందా అన్న ఆసక్తి, ఉత్కంఠ కూడా కలుగుతోంది. తొలిసారి సంకీర్ణంలోకి అడుగుపెట్టిన మోడీ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న తొలి బడ్జెట్ కావడంతో విపక్షాలతో సహా, అన్ని తరగతుల ప్రజలు కూడా గతంలో ఎప్పుడూ లేనంతగా ఆసక్తి కనబరు స్తున్నారు. దీంతో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టే బడ్జెట్‌పై సర్వత్రా చర్చ సాగుతోంది. ఇకపోతే దేశ ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏడోసారి కేంద్రబడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమయ్యారు. అంతకుముందు పార్లమెంటులో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టనున్నారు. నిర్మలా సీతారామన్ పేరిట వరుసగా ఏడు బడ్జెట్‌లు సమర్పించిన రికార్డు నమోదు కానుంది. ఇప్పటి వరకు ఈ రికార్డు మొరార్జీ దేశాయ్ పేరిట ఉంది. బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు నిర్మలా సీతారామన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆర్థిక వ్యవస్థలోని వేర్వేరు వాటాదారులతో చాలాసార్లు చర్చలు జరిపింది. విద్య, ఆరోగ్య రంగం, క్యాపిటల్ మార్కెట్, ఉపాధి, నైపుణ్యాలతో పాటు రంగాలకు చెందిన అధికారులు, ప్రతినిధులతో చర్చలు జరిపారు. పలువురు ఆర్థికవేత్తలతోనూ ఆర్థిక మంత్రి సమావేశమయ్యారు. బడ్జెట్‌లో ద్రవ్యలోటు తగ్గింపుపై దృష్టి సారించాలని ఆర్థికవేత్తలు కేంద్రానికి సూచించారు. వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని రైతు సంఘాలు ఆర్థిక మంత్రిని కోరాయి. ఇకపోతే ఈసారి కేంద్ర బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు ప్రాధాన్యత దక్కాలని ఈ రెండు రాష్ట్రాలు కోరుకుంటున్నాయి. రెండు రాష్ట్రాల సిఎంలు పలుమార్లు కేంద్రమంత్రులను కలిసి ఇప్పటికే వివిధ అంశాలపై వినతులు సమరపించారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కీలక భాగస్వామిగా ఉన్న టీడీపీ.. ఏపీ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు, ప్రాజెక్టులు కేటాయించాలని కేంద్రాన్ని కోరుతోంది. ఈ క్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు ఇప్పటికే ప్రధాని మోదీ సహా కేంద్ర పెద్దలను కలిసి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోనూ ఈసారి బీజేపీ ఎక్కువ సీట్లు గెలుచు కోవడంతో.. రాష్ట్రానికి గతానికంటే ఎక్కువ లబ్ది చేకూరేలా నిర్ణయాలు ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. గతంలో లాగానే బడ్జెట్ 2024 కూడా పేపర్‌లెస్ ఫార్మాట్‌లో ఉండనుంది. బడ్జెట్ పత్రాలు హిందీ, ఇంగ్లీష్ మాత్రమే అందుబాటులో ఉంటాయి. కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన అన్ని పత్రాలు 'యూనియన్ బడ్జెట్ మొబైల్ యాప్'లో అందుబాటులో ఉంటాయి. దీంతో పార్లమెంట్ సభ్యులు, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా బడ్జెట్ పత్రాలు అందుతాయి. బడ్జెట్ సమర్పించిన కొద్దిసేపటికే అన్ని పత్రాలు ఈ యాప్‌లో అందుబాటులోకి రానున్నాయి. ఈ సారి బడ్జెట్ లో కేంద్రం ప్రజాకర్షక విధానాలవైపే మొగ్గుచూప బోతున్నట్టు తెలిసింది. ఆదాయపన్నుల్లో ఉపశమనం, కిసాన్ సమ్మాన్ నిధి, ఇళ్ల నిర్మాణాలకు ఊతమిచ్చే విధంగా నిర్ణయాలు ఉండబోతున్నట్లు తెలిసింది. మరోవైపు ఆదివారం అఖిలపక్ష స మావేశం జరిగింది. ఇందులో సంఘటిత ప్రతిపక్షాలు పలు కీలక విషయాలను ప్రభుత్వం ముందుంచాయి. విపక్షం బలంగా ఉండడం వంటి కారాణాల వల్ల పార్లమెంట్ సమావేశాల్లో ఇక దాటవేత ధోరణి కుదరదు. ప్రత్యేకించి నీట్ వివాదం, పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకేజ్ వంటి విషయాలపై సభలలో చర్చకు అవకాశం ఇవ్వాల్సిందే అని ప్రతిపక్షాలు అఖిలపక్షంలో పట్టుపట్టాయి. అనుకున్నట్లుగానే తొలిరోజే అంటే సోమవారమే దీనిపై విపక్ష నేత రాహుల్ ప్రస్తావించారు. చర్చకు పట్టుబట్టారు. అలాగే అనేకమైన ప్రజల అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది. బడ్జెట్‌తో పాటు, ప్రజా సమస్యలపై సహేతుకమైన సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉండాల్సిందే. గతంలో లాగా వాయిదాలు వేయడం,దాటవేయడం, ఎంపిలను సస్పెండ్ చేయడం లాంటి చర్యలు కదరవని గుర్తించాలి. ఇక ప్రభుత్వానికి కూడా సభా నిర్వహణలో అందరి మద్దతు అవసరం. అన్ని అంశాలపై చర్చకు తాము సిద్ధం అని అఖిలపక్షంలో కేంద్రమంత్రులు వెల్లడించారు. అయితే ఏదైనా కూడా సభా నిబందనలకు అనుగుణంగా ఉంటుందని తెలిపారు. వీటిని అంతా పాటించాల్సిందేనని ప్రతిపక్ష నేతలకు కేంద్రమంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. సభ అందరిదీ, సమిష్టి సహకార వైఖరితోనే నిర్ణీత రీతిలో సభలు నిర్వహించేందుకు వీలుంటుందని స్పష్టం చేశారు. అదే సమయంలో విపక్షాలు కూడా సమర్థంగా పనిచేయాల్సి ఉంటుంది. కేవలం గొడవలు సృష్టించేందుకు కాకుండా ఉమ్మడిగా సమస్యలపై చర్చించి ప్రభుత్వాన్ని నిలదీయగలగాలి. ఏదేమైనా సమావేశాలు అన్నవి ప్రజలకు సంబంధించినవిగా అటు ప్రభుత్వం, ఇటు విపక్షం గుర్తించాలి. ఇవి తమ ప్రతిష్టకు సంబంధించినవిగా చూడరాదు. ప్రతిష్టకు, పంతాలకు కూడా ఇది సమయం కాదు. ప్రజల సమస్యలపై పార్లమెంట్ జవాబుదారీగా వ్యవహరించాలి. గతంకన్నా భిన్నంగా సభ సాగిందన్న పేరు రావాలి. అప్పుడే దేశంలో నాయకులపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుంది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బలపడుతుందని గుర్తించాలి.

# ప్రజా ఫిర్యాదులను మనసు పెట్టి పరిష్కరించండి

**పిజిఆర్ఎస్ కు 201 ఫిర్యాదులు**

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

నంద్యాల,ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్వీకరించిన ప్రజా ఫిర్యాదులను మనసు పెట్టి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని సెంటినరీ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా నలుమూల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. డిఆర్ఓ ఎ.పద్మజ, జిల్లా అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి ప్రతి ఫిర్యాదును మనసు పెట్టి పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. మండల పరిధిలో శాఖల సమన్వయ లోపం వల్లే జిల్లా కేంద్రానికి అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని... డివిజనల్, మండల స్థాయి సిబ్బందితో సమస్యలను ఎందుకుకు పరిష్కరించలేకపోతున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. ఫిర్యాదుదారుడు ఇచ్చిన అర్జీని కూడా చదవలేని స్థితిలో కొంతమంది అధికారులు ఉన్నారని... ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా అధ్యయనం చేసుకొని పరిష్కార మార్గం చూపాలన్నారు. వానాకాలంలో వచ్చే వ్యాధులపై దృష్టి సారించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. వర్షాలు కొనసాగుతున్నందున జలమయమవుతున్న లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. తాను తనిఖీలు నిర్వహించిన ప్రాంతాల్లో పారిశుధ్య లోపాలున్నట్లు గమనించానని పంచాయతీ అధికారులు, ఎంపీడీఓలు, మునిసిపల్ అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొని చెత్తను డంప్ యార్డులకు తరలించాలన్నారు.పరిపాలనకు సంబంధించిన అన్ని దస్త్రాలు ఈ ఆఫీస్ ద్వారానే సర్క్యులేట్ కావాలని జిల్లా అధికారులను ఆమె ఆదేశించారు. 102 లోకాయుక్త కేసులు, 150 హైకోర్టు కేసులు ఏ ఏ కారణాల వల్ల పెండింగ్లో ఉన్నాయని సంబంధిత వివరాలన్నింటినీ వచ్చే సోమవారానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. త్రాగునీరు కలుషితమై సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు ఓఆర్హెచ్ఎస్ ట్యాంకులను శుభ్రం చేసి తగు మోతాదులో క్లోరినేట్ చేసిన నీటినే సరఫరా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ట్యాంకులను శుభ్రం చేసిన తేదీలను అందరికీ కనపడేటట్లు ప్రదర్శించాలన్నారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై సమగ్ర నివేదికలను 3 రోజుల్లో ఇవ్వాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద 6000 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించే దిశలో చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు.

# భారత స్వాతంత్ర్యోద్యమంలో దేశమాత విముక్తి కోసం సాయుధపోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్

*-నేడు అయన జయంతి*



భారత స్వాతంత్ర్యోద్యమంలో దేశమాత విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్.. అజాద్ ఈ పేరు వింటే చాలు తెల్లదొరలు గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. ఎక్కడ ఏ విధ్వంసానికి పథకం రచించి, తమపై దాడి చేస్తాడోనని ప్రాణాలు అరచేతబెట్టుకునేవారు. బ్రిటిషర్ల దాస్య శృంఖలాల నుంచి భరతమాతకు విముక్తి కలిగించడం కోసం ఎందరో మహాత్ములు తమ ప్రాణాలను ఫణంగా పెట్టారు. మరెందరో వీరులు ఉరికంబమెక్కారు. అలాంటి వారిలో ముఖ్యులు భగత్ సింగ్, చంద్రశేఖర్ అజాద్. అత్యంత పిన్నవయసులోనే దేశం కోసం తమ జీవితాన్నే అర్పించిన మహాపురుషులు. దేశం గర్వించదగ్గ ఆ మహాపురుషుల్లో చంద్రశేఖర్ అజాద్ కూడా ఒకరు. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా మరియు అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైల్లు పరిగెత్తించిన చంద్రశేఖర్ ఆజాద్ మనదేశం గర్వించదగ్గ అసమాన వీరుడు. భగత్ సింగ్ మార్గ నిర్దేశకుడిగా పేరుగాంచిన ఆజాద్ పూర్తిపేరు చంద్రశేఖర సీతారామ్ తివారి. ఈయన పండిత్‌జీగా కూడా పిలువబడ్డారు.మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝాబువా జిల్లా, బాద్రా (భాబ్ గా) గ్రామంలో పండిట్ సీతారామ్ తివారి, జగరానీ దేవీలకు 1906 జూలై 23వ తేదీన చంద్రశేఖర్ ఆజాద్ జన్మించారు. ప్రాథమిక విద్యను సొంత గ్రామంలోనే పూర్తి చేసిన ఈయన వారణాసిలో సంస్కృత పాఠశాలలో హయ్యర్ సెకండరీ విద్యను అభ్యసించారు.1919లో అమృత్‌సర్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ దుర్ఘటనతో తీవ్రంగా కలతచెందిన ఆజాద్.. ఆ తరువాత 1921లో మహాత్మాగాంధీ నడిపిన సహాయ నిరాకరణోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొన్న నేరానికిగానూ ఈయన తన పదిహేనేళ్ల ప్రాయంలోనే అరెస్టయ్యారు.విచారణ సందర్భంగా కోర్టులో "నీ పేరేంటి?" అని మెజిస్ట్రేట్ అడిగిన ప్రశ్నకు ఆయన పెద్ద శబ్దంతో "ఆజాద్" అని అరచి చెప్పారు. దాంతో ఆయనకు మెజిస్ట్రేట్ 15 కొరడా దెబ్బలు శిక్షగా విధించాడు. అయితే ప్రతి కొరడా దెబ్బకు ఆయన భారత్ మాతాకీ జై (వందేమాతరం) అంటూ గొంతెత్తి నినదించారు. ఇక అప్పటినుంచి చంద్రశేఖర్ ఆజాద్‌గా ఆయన పేరు స్థిరపడిపోయింది.సహాయ నిరాకరణోద్యమం ఆజాద్‌లో దాగి ఉన్న విప్లవవాదిని మేల్కొలిపింది. ఎలాగైనా సరే భారతదేశాన్ని బ్రిటీష్‌వారి కబంధ హస్తాల నుంచి విడిపించాల్సిందేనని ఆయన బలంగా నిశ్చయించుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆయన హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను స్థాపించారు. భగత్ సింగ్, సుఖదేవ్, తదితరులకు మార్గనిర్దేశకుడిగా మారారు.1928వ సంవత్సరంలో పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి కన్నుమూసిన 'పంజాబ్ కేసరీ లాలాలజపతిరాయ్ మృతికి ప్రతికారంగా రాజ్ గురు, భగత్ సింగ్, బ్రిటీష్ పోలీస్ అధికారి సాండర్స్ ను కాల్చి చంపగా, సాండర్స్ వెంట వచ్చిన హెడ్ కానిస్టేబుల్ రాండ్ ను అజాద్ కాల్చి చంపాడు. ఉత్తర ప్రదేశ్, పంజాబ్ ప్రభుత్వాలు ఆజాద్ ను సజీవంగా పట్టుకునే ప్రయత్నం చేశాయి. అతనిని ప్రాణాలతో తీసుకువచ్చినా లేక చంపి తెచ్చినా 30 వేల రూపాయలు బహుమతిగా ప్రకటించారు. అ రోజు 1931, ఫిబ్రవరి 27, శుక్రవారం అలహాబాదులోనిఆల్ఫ్రెడ్ పార్క్‌కు చేరుకోగా, ఇన్ఫార్మర్లు ఇచ్చిన సమాచారం మేరకు బ్రిటీష్ పోలీసులు చుట్టుముట్టారు. ఆజాద్‌ను లొంగిపోవాలంటూ హెచ్చరికలు చేశారు. అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పోలీసులకు లొంగకుండా, ఒక్కడే పోరాడుతూ ముగ్గురు పోలీసులను హతమార్చారు. అలసిపోయేదాకా పోరాడిన ఆయన చివరి క్షణంలో తన వద్ద మిగిలిన ఒకే ఒక్క బుల్లెట్‌తో తనను తానే కాల్చుకుని అశువులు బాసారు. అజాద్ పోరాడిన తీరు భారతదేశ విప్లవ చరిత్రకే వన్నె తెచ్చిన ఘటన. భారతీయ యువత ముందు నిలిచిన ఒక మహోజ్వల ఉదాహరణ.

# బడ్జెట్ ప్రవేశంలో నిర్మల చరిత్ర

**అత్యధిక సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత**

**మరోమారు ఎవ్వరికీ అందనంతగా రికార్డు**



న్యూఢిల్లీ,జూలై22 : కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జులై 23న మంగళవారం మరోమారు పార్లమెంట్‌లో 2024-25 బడ్జెట్ ను ప్రవేశపెట్టబోతున్నారు. మోదీ 3.0 సర్కారులో ఆమె ప్రవేశపెడుతున్న మొదటి బడ్జెట్ కాగా, ఆమె మొత్తంగా ఎక్కువసార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థికమంత్రి, మహిళా మంత్రిగా చరిత్ర సృష్టించబోతున్నారు. గతంలో ఉన్న రికార్డునలు తిరగరాయబోతున్నారు. మొత్తంగా చూస్తే ఆమె ప్రవేశపెడుతున్న ఏడో కేంద్ర బడ్జెట్ ద్వారా తన పేరును చరిత్రలో లిఖించుకో బోతున్నారు. ఇప్పటికే నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఐదు పూర్తిస్థాయి బడ్జెట్ లు సమర్పించగా.. ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు.. ఇప్పుడు ఆరోసారి పూర్తిస్థాయి బ్జడెట్ ను ప్రవేశబెట్టి.. మరో రికార్డును తిరగరాయనున్నారు. ఇంతకుముందు వరుసగా ఐదు కేంద్ర బడ్జెట్లు ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్, అరుణ్‌జైట్లీ, పి.చిదంబరం, యశ్వంత్‌సిన్హా, మన్మోహన్‌సింగ్‌ను ఆమె అధిగమించనున్నారు. 1959 నుంచి 1964 వరకు ఆర్థిక మంత్రిగా ఉన్న మొరార్జీ దేశాయ్ ఐదుమార్లు పూర్తి బడ్జెట్లు, ఒక మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టారు. మొత్తంగా మొరార్జీ దేశాయ్ అత్యధికసార్లు బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఇన్నాళ్లు అత్యధిక బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మొరార్జీ దేశాయ్ పేరు మీదే ఉంది. దీనిని ఎవ్వరూ బ్రేక్ చేయలేదు.. అయితే.. తాజా బడ్జెట్ తో నిర్మలా సీతారామన్ వరుసగా ఆరుసార్లు పూర్తి స్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టి అరుదైన ఘనతను సాధించబోతున్నారు. వాస్తవానికి ఇందిరా గాంధీ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళ నిర్మలా సీతారామన్.. ప్రధాని హోదాలో ఉంటూ నాడు ఇందిరా గాంధీ బడ్జెట్ ప్రవేశపెట్టారు. స్వతంత్ర భారతదేశంలో తొలి పూర్తిస్థాయి మహిళా ఆర్థిక



మంత్రిగా ఎక్కువ కాలం కొనసాగిన నేతగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే రికార్డును నమోదు చేసుకున్నారు.వాస్తవానికి బడ్జెట్ ప్రవేశపెట్టడంలోనూ నిర్మల సీతారామన్ కొత్త పోకడలు తీసుకొచ్చారు. సంప్రదాయ బ్రీఫ్‌కేస్ విధానానికి ఆమె మంగళం పాడారు. జాతీయ చిహ్నంతో కూడిన ఖాతా పుస్తకం తరహాలో ఉండే బ్యాగులో ఆమె బ్జడెట్ పత్రాలు తీసుకొచ్చే సంప్రదాయానికి ఆమె శ్రీకారం చుట్టారు. 2019లో తొలి బ్జడెట్ నుంచి ఆమె ఖాతా బుక్ విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇప్పటి వరకు అతి సుదీర్ఘ బ్జడెట్ ప్రసంగం రికార్డు, అతి స్వల్ప ప్రసంగం రికార్డు కూడా నిర్మలా సీతారామన్ పేరిటే ఉన్నాయి. 2020లో ఆమె చేసిన బడ్జెట్ ప్రసంగం రెండు గంటల 40 నిమిషాలు సాగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో ఆమె చేసిన 57 నిమిషాల ప్రసంగం ఇప్పటి వరకు చేసిన ప్రసంగాల్లో అత్యల్పమైనది. నిర్మలా సీతారామన్.. 2019లో రెండోసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఆమెను కొనసాగుతున్నారు. మోదీ త్రీ పాయింట్ ఓ లో మొత్తం ఐదేళ్ల కాలానికి ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ కొనసాగితే అది కూడా ఒక రికార్డవుతుంది.. ప్రస్తుతం నిర్మలా సీతారామన్ కర్ణాటక నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

**రైతు ఆత్మహత్యలు ప్రభుత్వానికి కనపడవా**

**అంటున్నారు ప్రజలు**

**కే తిమ్మాపురం లో విషాదం**

**పురుగుల మందు తాగి బలవన్మరణం**

ఎమ్మిగనూరు,ఎమ్మిగనూరు మండలం కే తిమ్మాపురం గ్రామానికి చెందిన బిజి కిస్టన్న , బిజి లక్ష్మి దంపతుల కుమారుడు రైతు బోయ గుడిసే రంగన్న( 39) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నాడు.రాత్రి సమయంలో ఎమ్మిగనూరు మండలం కే తిమ్మాపురం గ్రామంలో బిజీ రంగన్న తన సొంత వ్యవసాయ పొలంలో పురుగుల మందు తాగి అపమారక స్థితిలో పడి ఉన్నాడు. గ్రామస్థులు గమనించి ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. ఆరోగ్య పరిస్తితి విషమంగా మారడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి కు తరలించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ కోలుకోలేక తుది శ్వాశ విడిచాడు. రంగన్న కు 2 ఎకరాలు సొంత భూమి తో పాటు మరో 5 ఎకరాలు కౌలు కు తీసుకొని సాగు చేస్తున్నాడు.పంటలు పండక పండిన పంటకు గిట్టుబాటు ధర లేక వ్యవసాయ పెట్టుబడికి చేసిన అప్పులు తీర్చలేక మనోవేదన కు గురై తనువు చాలించాడు. దాదాపు 5 లక్షల వరకు అప్పులు చేసినట్లు తెలిసింది. రంగన్న కు బార్య లక్ష్మి తో పాటు కుమారుడు జానకిరాముడు( 14) ,కుమార్తె మంజుల( 12) అన్నారు.అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్న బిజి రంగన్న కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కే తిమ్మాపురం గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఎమ్మిగనూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# తాడేపల్లిగూడెం నియోజవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపడానికి వైద్యులు సహకరించాలి

**- వైద్యుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్-**

తాడేపల్లిగూడెం,రాష్ట్రం లో తాడేపల్లిగూడెం నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలపడానికి వైద్యులు సహకరించాలని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు.ఆదివారం రాత్రి తాడేపల్లిగూడెం పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ నందు వైద్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి మినహా ఒక్క రూపాయి అడగననీ గూడెంను సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. తాడేపల్లిగూడెంలో లక్షలాది రూపాయలు వసూలు చేసే వైద్యులు లేరని పేర్కొన్నారు. 70- 80 లక్షల రూపాయలు వైద్యులు ఇండోర్ స్టేడియం నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. తాను మున్సిపల్ చైర్మన్ గా ఉన్నప్పుడు తాడేపల్లిగూడెంలో స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ పార్క్ వంటి వాటిని నిర్మించడం జరిగిందనీ తన సొంత నిధులు కోటిన్నర నిధులతో అభివృద్ధి చేశానన్నారు. అయితే ఏనాడు తాను చెప్పుకోలేదనీఒక రూపాయి ఎవర్ని ఆశించలేదని స్పష్టం చేశారు. నియోజవర్గ అభివృద్ధి కొరకు ఏదైనా అడుగుతాననీ మనం చనిపోయిన తర్వాత మంచి, చెడులు మాత్రమే వెంట తీసుకెళ్తామన్నారు. సేవకు తన జీవితాన్ని అంకితం చేస్తానని పార్టీ లో ఐదేళ్లపాటు తాను జనంలో ఉండి సేవ చేశాననీ ప్రజలు తనను గెలిపించి మరింత బాధ్యత పెంచి చట్టాల గురించి రాష్ట్రంలో మాట్లాడే హక్కు తనకు ప్రజలు కల్పించారన్నారు. ఎటువంటి లంచం లేని పాలన అందించాలని తన ధ్యేయమనీ దానికి విరుద్ధంగా పనిచేసే అధికారులను బదిలీపై వెళ్లిపోమని సూచిస్తున్నట్లు తెలిపారు. తాడేపల్లిగూడెం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు, నా గెలుపు మీదని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. వచ్చే రోజుల్లో గోదావరి ఏలూరు కాలువ గట్టు పరిరక్షణలో భాగంగా తాడేపల్లిగూడెం ఖ్యాతిని ఇనుమడింపజేసిన కోడె వెంకట్రావు, రేలంగి వెంకట రామయ్య, డాక్టర్ పి ఎల్ వి ప్రసాద్ వంటి మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్య క్రమంలో ఐఎంఏ వైద్యులు పాల్గొన్నారు.

# ఫెయిల్యూర్ అయిన ఈవీఎంలు బెంగళూరుకు తరలింపు

**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**

నంద్యాల సార్వత్రిక ఎన్నికలకు కోసం వచ్చిన ఈవియంలలో ఫెయిల్యూర్ అయిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను సోమవారం రోజున బెంగళూరుకు తరలిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం టెక్కే మార్కెట్ యార్డ్ లో భద్రపరిచిన ఈవీఎం గోడౌన్ ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఫెయిల్యూర్ అయిన ఈవీఎంలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో భాగంగా బెంగళూరు బెల్ కంపెనీ నుండి వచ్చిన ఈవీఎంలలో ఫెయిల్యూర్ అయిన 435 ఈవీఎంలను బెంగళూరుకు తరలిస్తున్నట్లు ఆమె తెలిపారు. కమిషనింగ్ లో డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు 194, మాక్ పోల్ డిఫెక్ట్ వచ్చిన ఈవీఎంలు 111, రిజర్వ్ లో ఉన్న ఈవీఎంలు 51, ఫస్ట్ లెవెల్ చెక్ లో పనిచేయని ఈవీఎంలు 78, ట్రైనింగ్లో డిఫెక్ట్ వచ్చిన ఒక ఈవియం వెరసి మొత్తం 435 ఈవీఎంలను స్కాన్ చేయడం పూర్తయిందని వీటన్నింటినీ బెల్ కంపెనీ, బెంగళూరుకు తరలిస్తున్నట్లు ఆమె తెలిపారు. సాంకేతిక లోప కారణంగా పనిచేయని 75 కంట్రోల్ యూనిట్లు, 165 వివి ప్యాట్లు, 195 బ్యాలెట్ యూనిట్లు మొత్తం కలిపి 435 ఈవీఎంలను సోమవారం బెల్ కంపెనీ, బెంగళూరుకు తరలిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎ. పద్మజ, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డ్వామా పిడి రామచంద్రారెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులైన కాంగ్రెస్ తరపున రియాజ్ భాష, బిజెపి తరపున కె. చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి తరపున శివరాంరెడ్డి, వైసిపి తరపున సాయిరాం రెడ్డి, సిపిఎం తరపున నరసింహ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# వరద ప్రాంతాలను పరిశీలించిన మంత్రి పొంగులేటి

భద్రాచలం,భద్రాచలం వద్ద గోదావరి కరకట్ట ప్రాంతాన్ని సందర్శించి,వరద ఉధృతిని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. వరద పరిస్థితిపై మరియు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మాట్లాడి సూచనలు చేసారు.తరువాత అనంతరం గోదావరి వరదలపై అధికారులతో ఏర్పాటుచేసిన సమిక్ష సమావేశంలో పాల్గొన్నారు.

# స్పా సెంటర్లలో యవ్వారం

ఒంగోలు, జూలై 22 బయటేమో స్పా, మస్సాజ్ సెంటర్ల బోర్డులు.. లోపలేమో యవ్వారం వేరే.. తనిఖీలకు వెళ్లిన పోలీసులు బిత్తరపోయారు.. ప్రకాశం జిల్లా ఎస్‌పిగా నాలుగురోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన దామోదర్ అసాంఘిక కార్యక్రమాలపై తనదైన స్టైల్లో దృష్టి పెట్టారు.. ఒంగోలులో మసాజ్ సెంటర్లపై ఏకకాలంలో దాడులు నిర్వహించారు. దీంతో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి.. ఒంగోలు నగరంలో మసాజ్ సెంటర్లు, స్పా క్లినిక్‌ల పేరుతో యువతులతో యువకులకు క్రాస్ జెండర్ మసాజ్‌లు చేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి.. దీంతో మొత్తం 16 స్పా సెంటర్లపై ఏకకాలంలో దాడులు చేయాలని ఎస్‌పి దామోదర్ పోలీసు సిబ్బందిని అదేశించారు. ఎస్‌పి ఆదేశాల మేరకు బృందాలుగా విడిపోయిన పోలీసులు నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో నడుపుతున్న స్పా సెంటర్లపై ఏకకాలంలో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పలు స్పా సెంటర్లలో యువకులకు యువతులు మసాజ్ చేస్తున్నట్టు గుర్తించారు. పలు సెంటర్లలో యువతీయువకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు.మరోవైపు స్పా సెంటర్ల పేరుతో క్రాస్ జెండర్ మసాజ్ చేస్తున్న కొన్ని పార్లర్లలో యువకులను ఆకర్షించేందుకు రూంలలో అధునాతమైన లైటింగ్‌లు, ఏసీలు ఏర్పాటు చేయడాన్ని చూసిన పోలీసులు బిత్తరపోయారు. అంతే కాకుండా మసాజ్ కోసం వచ్చే యువకులతో బేరసారాలు లేకుండా నేరుగా తెలుసుకునేందుకు ధరల పట్టిక కూడా ఏర్పాటు చేశారు. రెండు నెలలకు ఒక ప్యాకేజీ, మూడు, నాలుగు నెలలకు డిస్కౌంట్‌తో కూడిన ఆఫర్లు కూడా ఇస్తున్నట్లు గుర్తించారు. కొన్నేళ్లుగా ఒంగోలులో గుట్టుగా సాగుతున్న ఈ క్రాస్ జెండర్ మసాజ్ సెంటర్లపై స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోని పోలీసులు.. కొత్త ఎస్‌పి ఆదేశాలతో వెంటనే రంగంలోకి దిగి దాడులు చేయడం కలకలం రేపింది. స్పా సెంటర్ల పేరుతో క్రాస్ జెండర్లతో మసాజ్ చేస్తున్న వారిపై కేసులు పెట్టడం కంటే వారికి అవగాహన కల్పించి ముందు కౌన్సిలింగ్ చేయనున్నట్టు ఎస్‌పి దామోదర్ తెలిపారు.

# హత్యలకు రాజకీయ రంగులు

గుంటూరు, జూలై 22, వినుకొండలో రషీద్ హత్య రాజకీయ కోణంలో జరిగిందా? లేకుంటే వ్యక్తిగత కక్షలా? నడిరోడ్డుపై జరిగిన ఈ హత్య రాజకీయరంగు పులుముకుంది. హతుడు వైసీపీ వ్యక్తి అని.. చంపింది టిడిపి కార్యకర్త అని.. దీని వెనుక రాజకీయ ప్రోద్బలం ఉందని వైసీపీ ఆరోపిస్తోంది. రాష్ట్రపతికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతోంది. మరోవైపు టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన నెలన్నర కాలంలో దారుణ ఘటనలు చోటు చేసుకున్నాయని జగన్ ఆందోళన వ్యక్తం చేశారు.సోషల్ మీడియా ద్వారా ప్రధాని మోదీతో పాటు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ఘటన పూర్తిగా రాజకీయ రంగు పులుముకుంది. అయితే పోలీసులు మాత్రం ఇందులో రాజకీయ కోణం కనిపించడం లేదని చెబుతున్నారు. స్వయంగా జిల్లా ఎస్పీ ఒక ప్రకటన చేశారు.వాస్తవానికి హతుడు షేక్ రషీద్,నిందితుడు షేక్ జిలాని ఏడాది కిందటి వరకు వైసీపీలోనే తిరిగారు.వారి మధ్య వివాదాలతో విడిపోయినట్లు తెలుస్తోంది.2022 మొహర్రం రోజు మద్యం తాగిన క్రమంలో ఓ రెండు వర్గాలు సీసాలతో దాడి చేసుకున్నాయి.జిలాని బీరు సీసాతో ఒక వ్యక్తిని పొడవడంతో అతని తల,గొంతు పై గాయాలయ్యాయి.దాని తర్వాత కొందరి ప్రోద్బలంతో జిలాని ఇంటిపై రషీద్ దాడికి పాల్పడ్డాడు.జిలాని సోదరుడు జానీ, కుటుంబ సభ్యులను కొట్టి అక్కడే ఉన్న బుల్లెట్ బండిని తగులు పెట్టాడు. దీనిపై జిలాని ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదు. కానీ అంతకంటే ముందు బీరు సీసా తో పొడిచాడని జిలానిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. జైలుకు పంపించారు. దీంతో రషీద్ పై జిలాని కక్ష పెంచుకున్నాడు. అప్పటినుంచి ఇద్దరి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి.ఎన్నికల సమయంలో ముస్లిం నాయకుల మధ్య ఘర్షణ జరిగింది.ఈ కేసుల్లో జిలాని పేరును చేర్చారు.దీని వెనుక రషీద్ ఉన్నాడని జిలాని అనుమానించాడు.ఎలాగైనా మట్టు పెట్టాలని నిర్ణయం తీసుకున్నాడు.బుధవారం రాత్రి వినుకొండలో మద్యం దుకాణం నుంచి రషీద్ బయటకు రాగానే కొబ్బరి బొండాల కత్తితో దారుణంగా నరికి చంపాడు.ఇద్దరూ వైసీపీలోనే కొనసాగే వారని.. వైసీపీలో కొనసాగుతున్న రౌడీషీటర్ వద్ద అనుచరులుగా ఉండేవారని స్థానికులు చెబుతున్నారు. రషీద్ ది వైసీపీ అని.. చంపిన జిలాని మాత్రం టిడిపి కార్యకర్త అని వైసిపి ఆరోపిస్తోంది. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు వైసిపి అధినేత జగన్ వినుకొండ ఈరోజు వస్తున్నారు. ఇప్పటికే ఇది రాజకీయ కోణంతో జరిగింది కాదని పోలీసులు ప్రకటించారు. కానీ వైసీపీ నేతలు మాత్రం ఇది ముమ్మాటికీ రాజకీయ ప్రాద్బలంతో జరిగిన హత్యగా చెబుతున్నారు.మరోవైపు రెండు పార్టీల మధ్య ఫోటోల వార్ నడుస్తోంది. నారా లోకేష్ జన్మదిన వేడుకల్లో నిందితుడు జిలాని పాల్గొన్నారు అని.. టిడిపి కండువా వేసుకొని ప్రచార వాహనంపై జిలాని దిగిన ఫోటోలను వైసిపి ప్రచారం చేస్తోంది.అదే సమయంలో టిడిపి మరికొన్ని ఫోటోలను బయటికి తీసింది.వైసీపీ నేతలతో నిందితుడు జిలాని ఉన్న ఫోటోలను బయటపెట్టింది.దీంతో ఇది రాజకీయ అంశం గా మారిపోయింది.ఈరోజు జగన్ మృతుడి కుటుంబాన్ని పరామర్శించనున్నారు.అయితే ఇప్పటికే పోలీసులు వినుకొండలో 144 సెక్షన్ ప్రకటించారు.ప్రస్తుతానికి అమలులో ఉంది.దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.ఈ ఘటనతో రాజకీయంగా యాక్టివ్ కావాలని వైసిపి భావిస్తోంది.రాష్ట్రస్థాయిలో ఉద్యమించాలని నిర్ణయం తీసుకుంది.దీనిపై కార్యాచరణ ప్రారంభించింది.

# ఏజెన్సీలో పొంగుతున్న కొండ వాగులు

రంపచోడవరం,ఏజెన్సీ వ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండవాగులు పొంగిపొర్లుతున్నాయి. దేవీపట్నం మండలం ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి పోచమ్మ అమ్మవారి ఆలయం గోదావరి పూర్తిగా మునిగింది. గోదావరి వరద ఉధృతి అధికంగా ఉండడంతో పాపికొండలు టూరిజం బోట్లను నిలిపివేసారు. రంపచోడవరం మండలం భూపతిపాలెం ప్రాజెక్టు నుండి ఐదు గేట్లను ఎత్తి 2000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసారు ఇరిగేషన్ అధికారులు.రంపచోడవరం మండలం పందిరి మామిడి బందపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జిపై నుండి వరద నీరు ప్రవహిస్తోంది. రంపచోడవరం మండలం ముసురుమిల్లి ప్రాజెక్టుకు హెడ్ వర్క్ పూర్తి కాకపోవడంతో వరద నీరు వృధాగా పోతుంది. రాజవొమ్మంగి మండలంలో నెల్లిమెట్ల, లబ్బర్తి, ఒట్టిగడ్డ, ఎర్రంపాడు, లబ్బర్తి, అనంతగిరి గ్రామాల మధ్య రోడ్లపై వాగులు పొంగి పడడంతో సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దేవీపట్నం మండలం ఫజుల్లాబాద్ గ్రామ సమీపంలోని రహదారిపై వరద నీరు ప్రవహిస్తోంది.మారేడుమిల్లి మండలం బొడ్లంక గ్రామసమీపంలో ఉన్న పెల్లిరేవు కొండవాగు ఉధృతంగా ప్రవహించడంతో సుమారు 70 గ్రామాలు జలదిగ్బంధం అయ్యాయి.

# ఓవర్ టూ ఢిల్లీ

## హస్తినకు ఏపీ పాలిటిక్స్

విజయవాడ, జూలై 22 ఆంధ్రప్రదేశ్ రాజకీయం దేశ రాజధాని ఢిల్లీకి చేరుతోంది. కేంద్రం నుంచి భారీగా నిధులు రాబట్టేందుకు కొత్త ఫార్ములాతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకెళ్తున్నారు. దీనిపై తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. ఇక ఏపీలో వైసీపీ లీడర్లు, కేడర్‌పై జరుగుతున్న దాడులను పార్లమెంటులో ఎండగట్టేందుకు పార్టీ ఎంపీలతో వైఎస్ జగన్ వ్యూహం సిద్ధం చేశారు.ఏపీలో అధికార ఎన్డీయే కూటమి, విపక్ష వైసీపీల మధ్య పీక్స్‌కు చేరిన పొలిటికల్ ఫైట్‌లో ఢిల్లీ ట్విస్ట్ ఆసక్తికరంగా మారింది. పార్లమెంటు సమావేశాల కోసం టీడీపీ, వైసీపీ వ్యూహ ప్రతి వ్యూహాలు పన్నుతున్నాయి. పార్లమెంటు సమావేశాల్లో ఎలాంటి వ్యూహం అనుసరించాలో టీడీపీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు ఏపీ సీఎం చంద్రబాబు.మరోవైపు పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై వైసీపీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు వైఎస్ జగన్. తాడేపల్లి నివాసంలో ఎంపీలతో సమావేశమైన జగన్? ఢిల్లీలో తాను చేయబోయే ధర్నాపై చర్చించారు. రాష్ట్రంలో జరుగుతోన్న దాడులు, హత్యలను ఢిల్లీ వేదికగా కేంద్రం, దేశం దృష్టి తీసుకెళ్లాలన్నారు జగన్. దీనిపై పార్లమెంటులో వైసీపీ గళం వినిపించాలన్నారు. ఉభయ సభల్లో ఏవిధంగా వ్యవహరించాలో ఎంపీలకు సూచించారు. వైసీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులను దేశవ్యాప్తంగా తెలియజేయాలని జగన్ సూచించారు. రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోంమంత్రికి ఫిర్యాదు చేయాలని వైసీపీ ఎంపీలు నిర్ణయించారు.అటు దేశ రాజధానిలో జగన్ ధర్నా, ఇటు పార్లమెంటులో టీడీపీ, వైసీపీ ఫైట్‌కి రంగం సిద్ధమైంది. దీంతో ఢిల్లీ పొలిటికల్ స్క్రీన్‌పై ఏపీ పొలిటికల్ సినిమా రచ్చకు కౌంట్‌డౌన్ షురూ అయింది.పార్లమెంట్ లో అనుసరించాల్సిన వ్యూహంపై చంద్రబాబు నివాసంలో టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఏపీకి రావాల్సిన పెండింగ్ ప్రాజెక్టులపై చంద్రబాబు ఎంపీలకు వివరించారు. వివిధ శాఖలకు చెందిన సమాచారాన్ని తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని ఎంపీలకు చంద్రబాబు సూచించారు. అవసరాన్ని బట్టి రాష్ట్ర మంత్రులను వెంట పెట్టుకుని ఆయా శాఖలకు చెందిన కేంద్ర మంత్రులను కలవాలని దిశానిర్దేశం చేశారు. కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖల నుంచి తెచ్చుకోవలసిన నిధులు, వివిధ కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రానికి మరింత ప్రయోజనం పొందేందుకు చేయాల్సిన కృషిపై ఎంపీలకు చంద్రబాబు ప్రత్యేకమైన సూచనలు చేశారు. అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం కోసం ఒక్కో ఎంపీకి ఇప్పటికే కొన్ని శాఖలు చొప్పున బాధ్యతలు అప్పగించారు.ఆ ఎంపీలు తరచూ ఆయా కేంద్ర మంత్రుల్ని కలిసి రాష్ట్ర ప్రాజెక్టులను ఫాలో అప్ చేయాలన్నారు. కేంద్ర ప్రాయోజిత పతకాలకు ఎక్కువగా నిధులు వచ్చే అవకాశం ఉందని వాటి విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో వివిధ ప్రాజెక్టులకు భూముల కేటాయింపునకు సంబంధించిన పెండింగ్ అంశాలతో పాటు విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మళ్లీ గాడిన పెట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపైనా దిశానిర్దేశం చేశారు. విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ సంస్థలకు అవసరమైన పూర్తి సదుపాయాలు కల్పించడంపైనా అధికారులవద్ద నుంచి సమాచారం తీసుకుని సభ్యులకు ఇచ్చారు. కేంద్ర సంస్థలకు భూములు కావాలంటే.. వేగంగా ఇస్తామని చెప్పాలన్నారు. జగన్ ఢిల్లీలో చేస్తానని చెప్పిన ధర్నాను పట్టించుకోవాల్సిన అవసరం లేదని చంద్రబాబు ఎంపీల కు చెప్పారు. జగన్ గురించి, వైసీపీ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని .. సమయాన్ని రాష్ట్రాభివృద్ధి కోసం వెచ్చిస్తే మేలు జరుగుతుందని ఎంపీలు చెప్పారు. ఢిల్లీలో జగన్ ఏం చేస్తాడో అనేది ఇప్పుడు ముఖ్యం కాదని.. మనం ఏం చేయాలనేదే ముఖ్యం అని సీఎం చంద్రబాబు అన్నారు. జగన్ అంశా న్ని వదిలేసి.. రాష్ట్రం గురించి ఆలోచించాలని సూచించారు. పార్లమెంటరీ పార్టీ భేటీ తర్వాత ఎంపీలు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ఎంపీలు పన ?చేస్తామని ప్రకటిం చారు. జనగ్ గురించి ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు.

# మాకో పదవి కావాలి...

విజయవాడ, జూలై 22 కూటమిలో మిత్రపక్షంగా తిరుగులేని విజయం సాధించిన ఏపీ బీజేపీలో నామినేటెడ్ పదవులు ఎవరికి దక్కుతాయనే చర్చ మొదలైంది. ఇప్పటికే టీడీపీ, జనసేన తమ కోటాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలు తీసుకోగా, భవిష్యత్‌లో ఏర్పడే ఖాళీలను తమకు కేటాయించాలని కోరుతోంది బీజేపీ? ఇక చాన్స్ వస్తే ఫస్ట్ తమ పేరే ఉండాలని బీజేపీ సీనియర్ నేతలు సోము వీర్రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ ఇద్దరూ గత ఎన్నికల్లో పోటీ చేయాలని భావించినా, పొత్తుల్లో వారికి సీట్లు దక్కలేదు. దీంతో నామినేటెడ్ కోటాలో ఎమ్మెల్సీ చాన్స్ ఇవ్వాలని కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.బీజేపీలో ఏ పదవులు భర్తీ చేయాలన్నా? ముందుగా పార్టీలో వారి నేపథ్యం గమనిస్తారు. బీజేపీ ఫస్ట్ అన్నట్లు?. తొలి నుంచి పార్టీలో ఉన్నవారికే ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. ఇలాంటి కోటాలోనే కేంద్ర సహాయమంత్రిగా భూపతిరాజు శ్రీనివాసరావు, రాష్ట్ర మంత్రిగా సత్యకుమార్ పదవులు దక్కించుకున్నారు. దీంతో ఎమ్మెల్సీలుగా తమకే ముందు అవకాశం వస్తుందని ఆశలు పెట్టుకుంటున్నారు విష్ణు, వీర్రాజు.ఇద్దరికీ సంఘ్ నేపథ్యం ఉండటంతో అధిష్టానం తప్పకుండా తొలి అవకాశమిస్తుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరికి పార్టీలోనూ ఎలాంటి పదవులు లేవంటున్నారు. వీర్రాజు గతంలో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా? ఎమ్మెల్సీగా పనిచేశారు. ఇక విష్ణువర్ధన్‌రెడ్డి పార్టీ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. ఇద్దరికీ జాతీయస్థాయిలో పరిచయాలు ఉండటంతో తమకు పదవులు పక్కా అని అనుచరులతో చెబుతున్నారట?ఎమ్మెల్సీ పదవులను ఆశిస్తున్న వీర్రాజు, విష్ణువర్ధన్‌రెడ్డి ప్రాంతీయ, సామాజిక సమీకరణలు కూడా తమకు అనుకూలంగా మల్చుకుంటున్నారని చెబుతున్నారు. వీర్రాజు గోదావరి జిల్లాలకు చెందిన కాపు సామాజికవర్గ నేత అయితే విష్ణు రాయలసీమ ప్రాంతానికి చెందిన రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు. రాష్ట్రంలో ప్రధాన సామాజికవర్గాలైన ఈ రెండు కులాలకు ప్రాతినిధ్యం కల్పిస్తే పార్టీ బలోపేతమవుతుందని చెబుతున్నారట? పైగా రాయలసీమలో బీజేపీకి పెద్దగా పట్టులేకపోవడం వల్ల? తనకు చాన్స్ వస్తే ఆ ప్రాంతంలో పార్టీని విస్తరించే వీలుంటుందని పార్టీ పెద్దలకు వివరిస్తున్నారు విష్ణువర్ధన్‌రెడ్డి.ఇక రాష్ట్ర పార్టీ మాజీ అధ్యక్షుడైన వీర్రాజు? గతంలో ఎమ్మెల్సీగా పనిచేశారు. 2014లో టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైన సమయంలో ఎమ్మెల్సీ అవకాశం దక్కించుకున్నారు వీర్రాజు. టీడీపీ మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికైనా.. మిత్రపక్షాన్ని ప్రతిపక్షం కంటే ఎక్కువగా ఇబ్బంది పెట్టేవారని విమర్శలు ఆయనపై ఉన్నాయి. దీంతో ఇప్పుడు మళ్లీ అవకాశం ఇస్తారా? అనే చర్చ జరుగుతోంది.ఐతే పొత్తు ధర్మంలో పార్టీ ఎవరి పేరు సూచిస్తే వారికే అవకాశం ఇవ్వాల్సివుంటుందని? పార్టీకి తాను చేసిన సేవలు, పార్టీ పెద్దల సూచనల మేరకు నడుచుకున్న తనకు తగిన న్యాయం జరుగుతుందని నమ్మకం పెట్టుకుంటున్నారు వీర్రాజు. వాస్తవానికి అసెంబ్లీ ఎన్నికల్లో రాజమండ్రి అర్బన్ నుంచి పోటీ చేయాలని భావించారు వీర్రాజు. కానీ, ఆయనకు చాన్స్ దక్కలేదు. రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పోటీ చేశారు. దీంతో రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే రేసు నుంచి వీర్రాజు తప్పుకోవాల్సివచ్చింది. తన సీటు త్యాగం చేసినందున ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు వీర్రాజు.ఇక విష్ణు సైతం హిందూపురం ఎంపీగా పోటీ చేయాలని భావించారు. పొత్తుల్లో ఆ సీటు దక్కలేదు. దీంతో ఈ ఇద్దరూ పోటీకి దూరంగా ఉండిపోవాల్సివచ్చింది. దీంతో త్వరలో ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ పదవుల్లో తొలి అవకాశం తమకు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ ఇద్దరి ఆశలను బీజేపీ హైకమాండ్ నెరవేరుస్తుందా? లేదా? అన్నదే పార్టీలో చర్చనీయాంశంగా మారింది. వీరిద్దరిని కూటమి నాయకత్వం అంగీకరించడం కూడా ముఖ్యమని మరికొందరు అంటున్నారు. మొత్తానికి ఇద్దరూ ప్రస్తుతానికి వెయిటింగ్ లిస్టులో ఉన్నట్లు ప్రచారం చేసుకుంటూ పార్టీ నాయకత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు.

# జిల్లా భూకబ్జాలపై విచారణ జరపాలి

## అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

బద్వేలు,కడప జిల్లాలో గత పది సంవత్సరాల నుంచి ప్రభుత్వ భూములను పాలకవర్గ పార్టీలు అయినా వైసీపీ టిడిపిలోని ప్రజాప్రతినిధుల బంధువులు రాజకీయ పలుకుబడి కలిగిన నాయకులు ఇతర ప్రాంతాల హైదరాబాద్ బెంగళూరు గుంటూరు కర్నూల్ ప్రకాశం తదితర జిల్లాలకు చెందిన డబ్బున్న వ్యక్తులు రెవెన్యూ ఉన్నతాధికారులు ప్రమేయంతో ప్రభుత్వ భూములు లక్షా 50 వేల ఎకరాలు జిల్లాలో అన్యక్రాంతమైన ఈ వాటిపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా భూపోరాట సాధన కమిటీ కన్వీనర్ బి నారాయణ డిమాండ్ చేశారు ఆదివారం ఉదయం జిల్లా కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లా భూకబ్జాలపై విచారణ జరపాలని రౌండ్ టేబుల్ సమావేశానికి అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు అయినా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుబ్రహ్మణ్యం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ బిఎస్పి పార్టీ జిల్లా నాయకులు గుర్రప్ప ముఖ్య ఉపన్యాసకులుగా మాట్లాడారు ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ అధ్యక్ష వహించారు జిల్లా భూపోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి నారాయణ మాట్లాడుతూ వైసీపీ టిడిపి రెండు ప్రభుత్వాలు ఇప్పటికే పరిపాలించాయి వీరి పరిపాలనలో భూకబ్జాలు పెట్రేగిపోయాయని అన్నారు ఒంటిమిట్ట మండలం జోకుల పల్లె రెవెన్యూ పొలంలో 3000 ఎకరాలు పెన్నా పేరూరు రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 661 లో వందల ఎకరాలు భూములు అన్య క్రాంతమైన అన్నారు సిద్ధవటం మండలం నాయకులు కడప ప్రజాప్రతినిధులు ఎస్టేట్లు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ భూములను అనుభవిస్తున్నారన్నారు కాశినాయన మండలం అక్కింగుండ్ల రెవెన్యూ పొలంలో 2017 సంవత్సరం అప్పటి కలెక్టర్ బాబూరావునాయుడు ఆదేశాల మేరకు 6 మంది తాసిల్దార్లు ఆర్డీవో విచారించిన భూములు ఇప్పటికీ స్వాధీనం చేసుకోలేదన్నారు విలువ చేసే భూములు పలుకుబడి కలిగిన వారు ఆక్రమించుకున్నారన్నారు వారి పైన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు బద్వేల్ దొంగ పట్టాలు సృష్టించే వారిపై కేసులు నమోదు చేశారు ఎఫ్ ఐ ఆర్ లో ప్రకటించిన వారందరిని అరెస్టు చేయకుండా ఒకరిద్దరిని మాత్రమే అరెస్టు చేసి తర్వాత పట్టించుకోలేదన్నారు జెడ్ హెచ్ డి సి సొసైటీ ద్వారా దళితులు బద్వేల్ గోపవరం అట్లూరు పోరుమామిళ్ల మైదుకూరు ఖాజీపేట

మండలాలలో సాగు చేసుకుంటున్న భూములకు ఇప్పటికీ పట్టాలి ఇవ్వలేదు అన్నారు ప్రభుత్వపరంగా రైతు భరోసా సబ్సిడీలు పంట నష్టపరిహారం ఇన్సూరెన్స్ సౌకర్యాలు నోచుకోలేదన్నారు దళితులు సొసైటీ భూముల ద్వారా సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములను వైసీపీ ప్రభుత్వం ప్లే వుడ్ ఫ్యాక్టరీ యజమానులకు వందల ఎకరాలు అప్పజెప్పారు అదే విధంగా అన్నమయ్య డెవలప్మెంట్ అథారిటీ పేరుతో హెచ్ డి సి భూములు కూడా స్వాధీనం చేసుకున్నారు 30 ఏళ్ల నుంచి పంటలు వేసుకుంటూ అనుభవిస్తున్న దళిత కుటుంబాలను నేడు రోడ్లపాల్లో అయినారు సీకే దీన్నే మండలం కడప నగర పరిధిలో పుట్లంపల్లి రిమ్స్ పరిసర ప్రాంతాలు బుద్ధ టౌన్ షిప్ భావన టౌన్షిప్ తదితర ప్రభుత్వ భూములలో లేఅవుట్లు వేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం కార్పొరేషన్ పాలకవర్గ సభ్యులు రాజకీయ నాయకులు ఈ పని తప్ప ఇంకొకటి ప్రజా సమస్యలు పట్టడం లేదన్నారు

# మీ భర్త ఎవరో చెప్పండి..

**దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ శాంతికి నోటీసులు**

**రికార్డుల్లో భర్త పేరు మదన్మెహన్గా పేర్కొన్నారంటూ శాంతికి నోటీసులు**

**మీడియా సమావేశంలో భర్త పేరు మరొకటి చెప్పడంపై వివరణ కోరిన ప్రభుత్వం**

**ప్రభుత్వ అనుమతి లేకుండా మీడియా సమావేశం నిర్వహించడంపై అభ్యంతరం**

**శాంతిపై కొత్తగా తొమ్మిది అభియోగాలు నమోదు చేసిన ప్రభుత్వం**

విజయవాడ,సస్పెన్షన్లో ఉన్న దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శాంతికి ప్రభుత్వం తాజాగా నోటీసులు జారీ చేసింది. ఆమె భర్త ఎవరనే విషయంలో స్పష్టత కోరుతూ దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ నోటీసులు పంపారు. "దేవాదాయ శాఖలో 2020లో ఉద్యోగంలో చేరినప్పుడు భర్త పేరు కె. మదన్మోహన్ అని సర్వీస్ రిజిస్టర్లో ఆమె నమోదు చేయించారు. గత ఏడాది జనవరి 25న ప్రసూతి సెలవుల కోసం దరఖాస్తు చేసినప్పుడు కూడా భర్త పేరు మదన్మోహన్ అని పేర్కొన్నారు. కానీ ఈ నెల 17న నిర్వహించిన విలేకరుల సమావేశంలో పి.సుభాష్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకున్నట్టు తెలిపారు. విడాకులు తీసుకోకుండా రెండో పెళ్లి చేసుకోవడం ఉద్యోగి ప్రవర్తనా నియమావళికి విరుద్ధం. దీనిపై 15 రోజుల్లో సమాధానం చెప్పాలి" అని నోటీసుల్లో పేర్కొన్నారు. ఆమె తీరుతో దేవాదాయశాఖ ప్రతిష్ఠకు భంగం కలిగిందని, దీనిపై వివరణ ఇవ్వాలని కోరారు. ఇప్పటికే శాంతిపై వివిధ ఆరోపణలు రావడంతో ఈ నెల 2న సస్పెండ్ చేసి తొమ్మిది అభియోగాలు నమోదు చేశారు.ఇటీవలఆమె నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రస్తావించిన అంశాలు, ఉమ్మడి విశాఖ జిల్లాలోసహాయ కమిషనర్గా ఉన్నప్పుడు చేసిన ఉల్లంఘనలకు సంబంధించి కొత్తగా ఆరు అభియోగాలు మోపారు.

# అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పెరుగుతున్న వరద ఉధృతి

**కాజ్ వే లపైకి చేరిన వరద నీరు**

**అప్రమత్తం అయిన జిల్లా అధికారులు,**

**సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన జిల్లా కలెక్టర్**

కోనసీమ,జిల్లాలో వరద ఉధృతి పెరిగింది. పలు చోట్ల వరద నీరు కాజ్ వే లపైకి చేరింది. దాంతో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ అధికారులను అప్రమత్తం చేసారు. సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.సోమవారం జరగాల్సిన గ్రీవెన్స్ ను కలెక్టర్ రద్దు చేసారు. పి.గన్నవరం మండలంలో కాజ్ వే లపైకి వరద నీరు చేరింది. ఉధృతికి చాకలిపాలెం - కన కాయలంక కాజ్వే మునిగింది. కోనసీమ - పశ్చిమగోదావరి జిల్లాల రాకపోకలు నిలిచిపోయాయి. అయినవిల్లి మండలం ముక్తేశ్వరం ఎదురు బిడియం కాజ్ వే పైకి వరద నీరుచేరింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. 45 లంక గ్రామాలపైవరద ప్రభావం చూపనుంది. వరద తీవ్రత ఎక్కువగా ఉంటుందని అధికారులు 24 అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఆదేశించారు.

# ఎన్టీఆర్ జిల్లాలో గోవులఅక్రమ రవాణా అడ్డుకున్న పోలీసులు

నందిగామ , నందిగామ వై జంక్షన్ వద్ద 2 డీసియమ్ వ్యాన్లలో 35 గోవులను అక్రమంగా రవాణా చేస్తుండగా సి.ఐ హనీష్ పట్టుకున్నారు. కృష్ణాజిల్లా ఆగిరిపల్లి నుండి హైదరాబాదు కబేలాకు 35 అవులు తరలిస్తున్నట్లుగా గుర్తించారు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని డీసియమ్ వ్యాన్ స్వాధీనం చేసుకొని గోవులను గోశాల కి తరలించారు. ఎన్ని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన గోవులను రక్షించలేకపోతున్నారని గోవులు లేకపోతే సృష్టినాశనం తప్పదని కొన్ని మతాలపండగల పేర్లతో గోవులను వధిస్తున్నారని మండిపడ్డారు గోవుల సంరక్షణ సమితి అధ్యక్షుడు వందేమాతరం అశోక్.

# సరసమైన ధరలకు బియ్యం, కందిపప్పు

విజయవాడ, జూలై 22 రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్లు, రిటైల్ మార్కెట్లలో సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం, కందిపప్పును ప్రత్యేక కౌంటర్లలో విక్రయిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ తెలిపింది. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశామని అధికారులు తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా రైతు బజార్లు, రిటైల్ మార్కెట్లలో సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం, కందిపప్పును ప్రత్యేక కౌంటర్లలో విక్రయిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ తెలిపింది. పౌరసరఫరాల శాఖ ఆదేశాలతో ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని రైతు బజార్లలో, ఉషోదయ, మెట్రో, రిలయన్స్, డిమార్ట్ రిటైల్ దుకాణాలలో సరసమైన ధరలలో నాణ్యమైన బియ్యం, కందిపప్పును ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయిస్తున్నట్లు జేసీ సంపత్ కుమార్ చెప్పారు. ఇప్పటి వరకు 7 రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా, 27 రిటైల్ షాపులలో, 96 బియ్యం షాపులలో, 49 పప్పుధాన్యాల షాపులలో నాణ్యమైన బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్నట్లు జేసీ తెలిపారు. బహిరంగ మార్కెట్ లో రు.181 ధర ఉన్న కందిపప్పును రు.160లకు, అదేవిధంగా కర్నూలు సోనా మసూరి స్టీమ్ రైస్ బహిరంగ మార్కెట్ లో రూ.55.85 ఉండగా కిలో రు.49లకు, కర్నూలు సోనా మసూరి పచ్చి బియ్యం రు.52.40 నుంచి రూ.48 లకు తగ్గించి అమ్మటానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటి వరకు పలు దుకాణాల్లో 5335 వినియోగదారులు 227.74 క్వింటాళ్ల బియ్యం, 6923 వినియోగదారులు 83.02 క్వింటాళ్ల కందిపప్పు ప్రత్యేక కౌటర్లలో కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు.అన్ని అమ్మకపు కౌంటర్ల వద్ద సరుకుల నాణ్యతను టెక్నికల్ సిబ్బంది, తూకాన్ని లీగల్ మెట్రాలజీ సిబ్బంది తనిఖీ చేస్తుందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని ప్రత్యేక అమ్మకం కౌంటర్ల ద్వారా ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవలసినదిగా జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్ తెలిపారు



